


—ఇంద్రలేఖ

"అన్నయ్యా! నేను ఫస్టు క్లాస్‌లో పాసైతే నన్ను మెడిసిన్ చదివిస్తావు కదూ?" ప్రిపరేషన్ హాలీడేస్‌లో ఒక్క క్షణం వృథా కానీయకుండా చదువుతున్న మదన్ ఉన్నట్టుండి ప్రశ్నించాడు.

"తప్పకుండా." మాగజైన్ తిరగేస్తున్న మనోహర్ వెంటనే సమాధానం చెప్పాడు.

ఉయ్యాలలా ఉన్న మంచంలో ఊరికే కళ్లు మూసుకు పడుకుని ఉన్న రాఘవమ్మ పెదాల మీద పేలవమైన చిరునవ్వు కదిలింది, ఆ అన్నదమ్ముల సంభాషణకు.

"అమ్మా! మందు వేసుకున్నావా?" వంటింట్లో పని అంతా ముగించుకుని కొంగుతో చేతులు తుడుచుకుంటూ వచ్చింది మాధవి.

"అక్కా! అన్నయ్య నన్ను మెడిసిన్ చదివిస్తాట్టగా!" సంబరంగా చెప్పాడు మదన్.

కనుబొమలు ముడిచి ఏదో అనుబోతున్న మాధవిని కళ్లతోనే వారించాడు మనోహర్.

నిట్టూర్చింది ఆమె. 'నిజమే. పరిస్థితులను అర్థంచేసుకోకుండా బంగారు మేడలు కట్టుకునే వయసు మదన్‌ది. తను వెటకారంగాఏమైనా అనేసి ఉంటే... వాడి ఊహలన్నీ పేకమేడల్లా కూలిపోతాయి. ఇప్పట్నుంచే బ్రతుకు మీద నిస్పృహ పెంచుకుంటాడు. ఈడుకు మించిన తెలివితేటలు, చురుకుతనం అన్నీ ఉన్న మదన్ ఏ గొప్పవాళ్లింట్లోనో పుట్టి ఉంటే ఈ డాక్టర్ కోర్స్ ఓ గగన కుసుమమై ఉండేది కాదు. కానీ, అప్పుడు అన్నయ్య ఉత్తుత్తి వాగ్దానానికే వాడి కళ్లలో ఇంత మెరుపు ఉండేది కాదేమో?

పుస్తకం పేజీలు తిప్పుతున్న మనోహర్ మనసులో కూడా ఆలోచనలు. 'తను కూడా వాడి వయసులో ఉండగా భవిష్యత్తు మీద బోలెడు ఆశలు పెంచుకున్నాడు. ఇంజినీర్ కావాలని, గొప్పగా పేరు సంపాదించాలని, అమ్మా నాన్నలని బాగా సుఖపెట్టాలని, మాధవికి గ్రాండ్‌గా పెళ్లిచేయాలని — ఎన్ని కలలని అప్పటి ఈ మనసులో! హుం. చివరికేం మిగిలింది? పోనీ, కనీసం రచయితగానైనా రాణించాలనుకున్నాడు. ఏం లాభం? తను వ్రాసేవన్నీ తిరిగి రావడం జరుగుతూంది. ఇప్పుడు ఏమైనా వ్రాయాలనే ఇచ్ఛ కూడా లుప్తమైపోతూంది. ఒకవేళ

**1973 ఫలితాలు**

ఏదైన ఒక పువ్వు పేరు లేదా అక్షరం పేరు, వ్రాసిన వేళ మాత్రం తెల్పుచు వ్రాయండి. 12 నెలలకు మీ జీవిత ఫలితాలు వ్రాసి రు. 3-75 లకు వి. పి. ఉత్తరం ద్వారా పంపబడును. పోస్టేజి అదనం. ఉత్తరములు ఇంగ్లీషులో వ్రాయండి.

**M/s. Victoria Commercial Co.,**
(APW.L|II)
AMBALA CANTT. (N. INDIA)
Pin 133001

**ఇంకా పొడుగు ఎదగండి**

2" — 8"



మాతన శాస్త్ర పద్ధతులతో వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి. ఆరోగ్యవంతులవండి. స్త్రీ పురుషులకు యిద్దరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి ఏంతమాత్రం లేదు. వివరములు ఇంగ్లీషులో గాని తెలుగులో గాని ఉచితం.

**TOTAL HEALTH,**
**283, Azad Market (AVP), Delhi-6.**

దంతవైద్యులు అంటున్నారు.

# నియమానుసారం రోజూ పళ్లు ఇగుళ్లు తోముకుంటే ఇగుళ్ల బాధలను దంతక్షయాన్నీ అరికట్టుతుంది.

**ఫోర్‌హెన్స్ టూత్‌పేస్టును సక్రమంగా రోజూ వాడుచున్నవారు అయాచితంగా అంటున్నారు.**

"ఫోర్‌హెన్స్ టూత్‌పేస్టును, ప్రతి రోజూ దానిని వాడమని నిర్దేశించిన వైద్యునికి నా మనఃపూర్వక కృతజ్ఞతలు."
(సంతకం) విభూతిభూషణ బోస్; కలకత్తా.

"మా ప్రపంచ ప్రఖ్యాతమైన టూత్‌పేస్టును చాలా చిన్నతనం నుండి నియమానుసారంగా రోజూ వాడుతున్నాను. ఈ నాటికీ నా పళ్లన్నీ చెక్కు చెదరకుండా వున్నాయి. అన్నిటి కంటె ఫోర్‌హెన్స్‌ను ఉత్తమమైనదిగా నేను నమ్ముతున్నాను. అది ఒక దంతవైద్యునిచే సృష్టింపబడిన టూత్‌పేస్టు కావటమే అందుకు ముఖ్య కారణం."
(సంతకం) ఎస్.ఎన్. ఛటర్జీ, కోయంబత్తూరు.

జాఫ్రీ మేనర్స్ అండ్ కం. లి., వారి ఏ ఆఫీసులోనైనా ఈ ప్రశంసా పత్రాలను చూడవచ్చును.

సక్రమ దంత సంరక్షణ కోసం, ఫోర్‌హెన్స్ టూత్‌పేస్టును, ఫోర్‌హెన్స్ డబుల్-ఏక్షన్ టూత్‌బ్రష్‌ను, రాత్రి, ఉదయం, ఉపయోగించండి....నియమానుసారంగా మీ దంత వైద్యుని వద్దకు వెళ్లండి!




ఉచితం! "దంతములు, ఇగుళ్లు గురించి తీసుకో వలసిన శ్రద్ధ అనే వివరణాత్మకమైన రంగుల చిన్న పుస్తకము",

*మీ ప్రతి కోసం 25 పైసల తపాలా బిళ్లలను (తపాలా ఖర్చులకై) మేనర్స్ డెంటల్ అడ్వయిజరీ బ్యూరో, పోస్టు బ్యాగ్ నం. 10031, బొంబాయి-1కి ఈ కూపన్ తోపాటు పంపండి.

పేరు: ______________ వయస్సు ______
Z-14
చిరునామా: ______________

*ఇంగ్లీషు, హిందీ, మరాఠీ, గుజరాతీ, ఉరుదు, బెంగాలీ, అస్సామీస్, తమిళం, తెలుగు, మలయాళం, కన్నడ, వీటిలో మీకు కావలసిన భాష క్రింద గీతగీయండి.

**ఫోర్‌హెన్స్ దంతవైద్యునిచే సృష్టింపబడిన టూత్‌పేస్టు**

IOSF-182 Tel

లీలగా మెదిలే బాధనూ కళ్ళు విప్పార్చుకుని చూసింది మాధవి.

"క్షమించన్నయ్యా. నువ్వు రచయితవని మరిచిపోయాను." నెమ్మదిగా అని వెళ్ళిపోయింది.

లైటార్పి పడుకున్నాడు మనోహర్.

మూసుకున్న కనురెప్పల్లో రాధ. చుట్టూ చీకటి వలయాలు. అందులోంచి బయట పడడం తన కసాధ్యమని తెలిసిన దానిలా, జీవితాన్ని విధి చేతులకు వదిలేసి మూగగా, మౌనంగా ఉండిపోయిన రాధ కనిపిస్తోంది. బీదరికం, అందమూ, ఆడతనమూ సృష్టించిన నరకాన్ని, ఎవరో చేసిన పాపాలకు శిక్షలా అనుభవిస్తూ, అమాయకంగా చూస్తూ, మలినంగా నవ్వుతూంది.

ఈవేళ స్ట్రీట్ డాన్సర్‌గా మొదలైన జీవితం పోను పోను ఎలా మలుపులు తిరిగి, ఏ వైతరిణిలో కలిసిపోతుందో? కడుపులో కాల్చుతున్న ఆకలికోసం, మొగ్గలా మృదువుగా ఉన్న ఆ అందం ఆహుతి అయిపోతూ, ఏ ఆసరా చూపించలేని ఈ సంఘపు క్రౌర్యానికి, దౌష్ట్యానికి బ్రతుకే బలి అయిపోతూ ...'

ఊహాకే వణికిపోయాడు మనోహర్. 'ఛ! ఛ! మరీ ఇంత భయంకరంగా ఆలోచిస్తున్నా నేమిటి? రాధ అందాన్ని, సౌజన్యాన్ని చూసి ఏ గొప్పవాడో ఆమెను ఈ మురికి కూపం లోంచి లేవనెత్తుతాడేమో కథల్లోలా!' అతనికే నవ్వు తెప్పించింది ఈ ఆలోచన.

'కథల్లో మాత్రమే సంభవమయ్యే మిరకిల్స్ నిజ జీవితాల్లో కూడా తటస్థపడితే ఇక లేని దేముంది?

'అసలైనా ఈ అమ్మాయి బ్రతికేందు కిక వేరే మార్గమే లేనట్లు ఈ దారి ఎందుకు ఎన్నుకుంది? స్త్రీ జనోద్ధరణ సంఘాలు, మహిళా మండలులు ఎన్ని లేవు—ఆడది పరువుగా బ్రతకాలి అనుకుంటే?'

ఇంత అమాయకంగా ఆలోచిస్తున్న మనసుపై జాలిపడ్డాడు మనోహర్.

'ఈ అనాథ శరణాలయాలు, మహిళా మండలులు — ఇవన్నీ పట్టి మేడిపళ్ళలాటివని ఎవరికి తెలియదు? పెద్ద పెద్ద ఆశయాల వెనక ఏమేం జరుగుతున్నాయో ఎవరికి తెలియదు? బయట రాధ లాంటి ఆడపిల్లలు తమకు తాముగా మంటల్లో పడి మసి అవుతుంటే ... అక్కడ ఏదో ఉద్ధరించేస్తున్నామని బూటకపు కబుర్లు చెప్పే ఘరానా పెద్ద మనుషుల చేత సమిధలుగా అర్పించబడుతున్నారు.

'అబ్బ, రాధా! నువ్వు నా కెందుకు కనపడ్డావు?' ఏంచేయాలో తోచకుండా విసుగ్గా అనుకున్నాడు చివరకు.

'ఒకసారి రాధా వాళ్లింటికి వెళ్ళి,

మ వ్విలా అయిపోవడం నాకేం బాగాలేదు అని చెప్పి వస్తే?

'నా ఇష్టాయిష్టాలతో ఆ అమ్మాయి కేం సంబంధం? ఒకవేళ నిజంగా నా మాటకు విలువ నిచ్చి, రికార్డింగ్ డాన్సెస్‌కు గుడ్‌బై చెపుతుంది. ఆ తరవాత? సలహా ఇవ్వగలడు గానీ, చేయూత నివ్వ గలడా? ఉహుఁ. అదెలా సంభవం? మరి?'

అతని కెందుకో అశాంతిగా, చిరాగ్గా అనిపించసాగింది.

ఏం చేయలేని అసహాయత! ఏదో చేసేయాలనే ఆరాటం.

కామం నిండిన చూపులతో, విషపు నవ్వులతో, తనను నలిపివేయాలని దగ్గరకు వస్తున్న వాళ్లను తప్పించుకునేందుకు వ్యర్థప్రయత్నం చేస్తూ, భయంగా నీళ్లు నిండిన కళ్లతో అర్థిస్తూ, వణికిపోతూ, చివరకు నిస్సహాయతతో లొంగిపోతున్న రాధ...

అతని ఊహలలో, ఆలోచనలలో దగ్గరగా, చాలా దగ్గరగా వచ్చేస్తూ అతని మనసును ఊపివేస్తోంది ఉండి ఉండి.

ఇక పడుకోలేక లేచిపోయాడు మనోహర్.

తెరిచి ఉన్న కిటికీలోంచి చీకటిని చూస్తూ నిలబడ్డాడు.

'ఈ చీకటిని మరిపించేందుకు మెరిసే నక్షత్రా లున్నాయి. ఈ చీకటిని శాశ్వతం కానీయకుండా చేసేందుకు ఉషస్సు ఉంది. కానీ, రాధకు? ఏ ఆశ మిగిలిపోయి ఉంది ఆమె బ్రతుకును మురిపించేందుకు?' కణతలు నొక్కుకున్నాడు.

'ఉహుఁ. ఇక ఈ వేళకి నిద్ర రాదు. రాధ నా మనసులోంచి పోదు.' లైట్ వేసి కాగితాలు, పెన్ తెచ్చుకు కూర్చున్నాడు.

అతని మనసులోని ఆవేదన, స్పష్టంగా ఎందుకో చెప్పలేని ఆవేశం, గుప్తంగా ఎక్కడో హృదయపు అట్టడుగు పొరల్లో నిద్రపోతున్న ఈ సమస్యతాలూకు పరిష్కారం—అన్నీ, అన్నీ అక్షరాలలో ప్రాణం పోసుకుంటున్నాయి.

'ఏదో చేసేయాలని తపించిపోయి, చివరకు ఏం చేయక, అశక్తుడిలా ఉండిపోయేవాడు రచయితగా మారికూర్చుంటాడేమో!' తను వ్రాసేసిన దంతా ఒకసారి చదువుకున్న మనోహర్ నవ్వుకున్నాడు. అతని కిప్పుడు శాంతిగా ఉంది. తన బాధలన్నీ ఇతరులతో చెప్పేసుకోగా ఏర్పడే తేలికతన మేదో అతనిని ఆవరించుకున్నట్లుగా ఉంది.

కళ్లు ఎర్రబడేలా ఏడ్చి ఏడ్చి, అలిసిపోయి పడుకునే పసి పాపాయిలా హాయిగా నిద్రపోయాడు కొంచెంసేపట్లోనే.

* * *

"అన్నయ్యా! నువ్వు వ్రాసిన కథకు ఫస్ట్ ప్రైజ్ వచ్చింది."

మాధవి మాటలకు ఆఫీసు నుంచి అప్పుడే వచ్చిన మనోహర్ అలసటగా కుర్చీలో కూర్చుంటూ—"నీకు ఈ అన్నయను ఏడిపించేందుకు ఇంతకన్నా మంచి విషయ మేం దొరకలేదా?" అన్నాడు.

"నిజం, అన్నయ్యా!"

"ఊరుకో, మధూ! నాలుగైదు నెలలుగా నే నే కథా పత్రికకు పంపలేదు. అబద్ధం ఆడినా అతికినట్లుగా ఉండాలి."

"అరె, బాబూ! ఇంకా నమ్మకంలేదా? ను వ్వా రోజు రాత్రి కూచుని వ్రాశావే—దాన్ని నేను ఫెయిర్ చేసి పంపాను. దానికే ప్రైజ్ వచ్చింది, సరా?"

"రాధ కథకా?" అనేసి నాలిక కరుచుకున్నాడు.

"రాధ కథా? ఆ హీరోయిన్ పేరు అది కాదే! నువ్వు సృష్టించిన పాత్రల పేర్లు నువ్వే మరిచిపోతున్నావు, ఏం రచయితవి నువ్వు? !" నవ్వేసి లోపలికి వెళ్లింది మాధవి.

అతని కెందుకో ఈ నిజం నమ్మబుద్ధి కావడం లేదు. ఆ రోజు రాధను చూడటం, ఆ రాత్రి విపరీతంగా ఆమెను గురించిన ఆలోచనలతో బాధపడడం, ఆ ఆలోచనలు వదిలించుకునేందుకు, మనసును తేలిక చేసుకునేందుకు ఏదో కాగితాలను నలుపు చేయడం—ఇదంతా అతను పూర్తిగా మరిచిపోయాడు.

అతను రచయిత కాబట్టి, ఆ అమ్మాయి కొంచెం పరిచయమున్న రాధ కాబట్టి, అతని మనసు మరీ సెన్సిటివ్ కాబట్టి అతనంతలా బాధపడ్డాడు ఆవేళ—

ఆ బాధను కథగా మలిచాడు అర్ధరాత్రి కూర్చుని. తనకు తెలిసిన రాధ కొద్దిపాటి జీవితానికి తన ఊహల రంగు కొంతా, ఆవేశపు పొంగు కొంతా కలిపి కాగితం మీద పేర్చాడు అందంగా.

దాని కీనాడు ప్రైజ్ వచ్చింది. అదీ మామూలు ఏ కన్సొలేషన్ ప్రైజో కాదు. ఫస్ట్ ప్రైజ్... ప్రముఖ వార పత్రికలో.

రాధలాంటి అమాయకపు ఆడవాళ్ల జీవితాలను కథగా వ్రాసేంత ఆవేశం కలవాళ్లూ, వాళ్ల కథలకు కరిగిపోయి ప్రైజ్ లిచ్చే సహృదయులూ, చదివి జలజలా కన్నీరు కురిపించేయగల పాఠ


కుటుంబ పోషణ ఏలా?
మెడికల్ బిల్లులు ఏలా?
అశాంతికరమైన ఈ ఆలోచనలన్ను
సిండికేట్ బ్యాంక్‌కు వదలండి.
ఆరోగ్యం పొందండి,



ఈ ఆవేదన సిండికేట్ బ్యాంక్‌కు వదిలి ఆరోగ్యం పొందండి.
మీరు సుస్తీపడి మంచమెక్కినపుడు. ఎంతమాత్రం చేయకూడని పని ఒకటే—ఆలోచన. మెడికల్ బిల్లు ఎలాగ? ఇంటి ఖర్చు ఎలాగ? ఈ ఆవేదన సిండికేట్ బ్యాంక్‌కు వదలండి. విశ్రాంతగా ఉండండి. ఇటువంటి క్లిష్ట సమయంలో భద్రత కోసం ఏర్పడినదే. సిండికేట్ బ్యాంక్‌వారి క్యూములేటివ్ మరియు సిక్‌నెస్ బెనిఫిట్ డిపాజిట్ విధానం చూస్తుండగానే పెరిగిపోతుంది మీ డిపాజిట్. అనారోగ్యం మొదలైన అత్యవసర స్థితి ఏర్పడి, డబ్బు అవసరమైనప్పుడు, మీ పెరుగగల సొమ్ముకు, రెండింతలు మీరు తీసుకోవచ్చు. మెడికల్ బిల్లులన్నీ కట్టవచ్చు. ఇంకా కుటుంబాన్ని పోషించుకోవచ్చుకూడా. ఇండియా అంతటాగల మా 550 బ్రాంచీలలో ఏ ఒక చోటికైనా దయచేయండి. సిండికేట్ బ్యాంక్‌లో అదా చేయండి. ముందుగా జాగ్రత్త పడండి. ముందు చూపుతో ముందంజ వేసేది సిండికేట్ బ్యాంక్.
ప్రతి బ్యాంకింగ్ అవసరానికి ప్రతి ఒక్కరి బ్యాంక్.

FAITHFUL SB FRIENDLY
సిండికేట్ బ్యాంక్
ప్రధాన కార్యాలయం : మణిపాల్
కె. కె. పై : కస్టోడియన్
SB/4/72 Tel

'ఛ! అదెలా సంభవం? ఎంతో మంది వాసన చూసిన పువ్వుతో నా హృదయా న్నెలా అలంకరించుకోను?' వెగటుగా అనుకున్నాడు.

'నలుగురూ నవ్వరూ? లోకాన్ని త్రోసిరాజన్నా, ఇంట్లో అమ్మ మళ్లీ మంచ మెక్కుతుంది. మాధవి తన ముఖమే చూడదు. మదన్ భవిష్యత్తుకి కూడా దెబ్బే. ఆమెను ఆ నరకం నుంచి తప్పించి, త నో నరకం సృష్టించుకోవాలి.' మనోహర్ మనసులో ఇప్పుడు రచయిత లేడు. మామూలు మనిషి ఉన్నాడు.

వయసుకు మించిన గాంభీర్యంతో, ఓలాటి నిర్లిప్తతతో మూర్తీభవించిన విషాదంలా ఉన్న రాధ అతని కళ్లకు మసక మసగ్గా కనిపించింది. బలంగా తల విదిలించి అక్కడి నుంచి వెళ్లిపోయాడు అతను.

*　　*　　*

"ఏమి టలా అన్నాన్ని కెలుకుతూ కూర్చున్నావు? ఈవేళ ఏదైనా ఆపరేషన్ కేస్ అటెండయ్యావా?" చిరునవ్వుతో తనవైపే చూస్తున్న అన్న చూపులను తప్పించుకున్నాడు మదన్.

"ఆపరేషన్ కా దన్నయ్యా ... ఆమె ... ఇంకా కళ్లలోనే మెదులుతూ ఉంది. కడుపులో దేవుతున్నట్లుగా ఉంది." హౌస్ సర్జెన్సీ చేస్తున్న మదన్ మనస్తత్వం కూడా ప్రతి చిన్న విషయానికీ బాధపడిపోయేదే. కొంచెం పరధ్యాన్నంగా, ముభావంగా ఉన్నాడూ అంటే—ఆ రోజు ఏమైనా జరిగినట్లే లెఖ్ఖ. అదేమిటో తమ్ముడిచేత చెప్పించేసి, అతని మనసు తేలిక చేయడం మనోహర్‌కు అలవాటే. ఈ రోజు కూడా వింటున్నాను, చెప్ప మన్నట్లు చూశాడు మదన్ వైపు.

"ఆమె వయసు పాతిక ముప్ఫై మధ్య ఉండవచ్చు. కానీ, శరీరం మాత్రం బాగా పండిపోయినట్లుగా ఉంది. కాళ్లు చచ్చుపడిపోయాయి. అస లా ఒంట్లో లేని రోగమంటూ లేదు. ఆ జైల్ వాళ్లు ఇక భరించలేక ఈ హాస్పిటల్‌లో పడేశారుట. కొంతమంది ప్రొఫెసర్స్ ఏ మంటున్నారో తెలుసా, అన్నయ్యా? ఆవిడను నలుగురు తిరిగే రోడ్డులో ఉంచితే... ఇక ఏ ఆడదీ వ్యభిచారం జోలికి పోదుట. అస లామెను ఈ స్థితికి తీసుకు వచ్చింది మగవాళ్లేగా? ఇటువంటి భయంకర రోగాలతో అర్థాంతరంగా చనిపోతున్న వాళ్లు ఎంతమంది ఉన్నారో ఇంకా? వాళ్ల మనసుల్లో ఎంత హాలాహలం మరుగుతోందో? స్వయంకృతం అని ఏవగించుకుంటారు గానీ, ఏ ఆడపిల్ల అయినా తనకు తాన గా ఈ రొంపిలో దిగుతుందా? దీనికి వెనక బీదరికం, మగవాడి అహంకారం లేకుండా ఉంటాయా? అన్నయ్యా! మే మందరం ఆమె వైపుగా వెళుతుంటే ఆ కన్నుల్లో ఎంత భయం కనిపించిందనీ! ఆ భయంలోనే స్పృహ తప్పిపోయింది. ఇందుకు కారణం—ఒకేసారి ఆమెను కొంత మంది బలవంతంగా అనుభవించి ఉంటారుట. అందుకే మమ్మ ల్నిలా గుంపుగా చూడగానే హడిలిపోయిందిట. నా కది వింటుంటే కళ్లు తిరిగాయి."

"న వ్విలాటి విషయాలను పెద్దగా పట్టించుకో కూడదు, మదన్!" అన్నం తినడం ఆపేసిన మనోహర్ నచ్చచెపుతున్నట్లుగా అన్నాడు.

మాట్లాడకుండా ఉండిపోయాడు మదన్.

"చూడు, తమ్ముడూ! నువ్వు చదువుతోంది మెడిసిన్. మనస్తత్వ శాస్త్రం కాదు. అందరి స్థితీ ఒకేలా ఉంటే ఇలా రకరకాల జబ్బులు రావు — మీ ప్రయోగాల కుపయోగ పడేందుకు." నవ్వాడు చెపుతూ.

"ఎందుకోగానీ, అన్నయ్యా, ఆమెను నే నెక్కడో, ఎప్పుడో చూసినట్లుగా అనిపిస్తోంది. కొంచెం కూడా జీవం లేని ఆ పెద్ద కళ్లు, కుడికంటి కిందుగా బుగ్గమీద కొట్టు వచ్చినట్లు కనిపించే ఆ పుట్టు మచ్చ. చూసినట్లుగా అనిపిస్తోందే తప్ప గుర్తురావడంలే దెంతకీ."

మజ్జిగను కంచంలో వంపుకోబోతున్న మనోహర్ ఆగిపోయాడు.

'ఉహుం. ఆమె కాకూడదు.' మనసులో అనుకుంటూ—"పేరేమిటో తెలుసా?" అని కంఠంలో వణుకు కప్పిపుచ్చుకునేందుకు వ్యర్థ ప్రయత్నం చేస్తూ అడిగాడు.

"రాధట ... అందమైన పేరు పెట్టారు ఆ తలిదండ్రు లెవరో గానీ. కానీ, పాపం! ఇంకో రెండు మూడు రోజుల్లో చనిపోబోతున్న ఆమె దగ్గర ఒక్కరు లేరు. ఆమెకోసం ఒక్కరు కూడా బాధపడరు. ఏం జీవితం అది?"

"అంత నిశ్చయంగా తెలుసా చనిపోతుందని?" ఎలాగో అడగగలిగాడు.

"అస లింకా చావకుండా ఉన్నందుకు ఆశ్చర్యపోవాలి, బాధపడాలి మనం."

వింటున్న మనోహర్ తేలిగ్గా నిట్టూర్చాడు. మళ్లీ ఎందుకో అతని గుండెల్లో ఇదని చెప్పలేని బరువు పేరుకుంది.

'మాధవికి తెలిసిన రాధ ... తన కథకి ప్రాణమై, మదన్ కనుల ముందు ప్రాణాలు విడవబోతూంది.' అతని పెదాల మీద జీవం లేని నవ్వొకటి కదిలింది.

రాధ లాటి ఆడపిల్లల జీవితాలను, వాళ్ల మనసులలోని సంచలనాన్ని కనులకు కట్టినట్లుగా చిత్రించి, అందరి హృదయాల్లో గొప్పస్థానాన్ని సంపాదించుకున్న మనోహర్ కళ్లలో నీళ్లు మెరవడం మదన్ చూడలేదు. ★


దీర్ఘరోగులకు ఉత్తమ సిద్ధవైద్యము



దిగులు పడవద్దు. దేహపుష్టి, నరముల బలహీనత యవ్వనశక్తిని గురించి, ఉబ్బసము (దమ్ము) కుష్టు, బొల్లి, చర్మ వ్యాధులు, కడుపులో నొప్పి, చెవుడు మొదలగు వాటికి నమ్మకంగా చికిత్స చేయబడును. మాకు వ్రాయండి.

శ్రీ బాలాజీ వైద్యశాల,

డా. పి. కుమారస్వామి దేవర, ఫోన్: 551, తెనాలి.
బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్ మద్రాసు—17.

Suvarna


## కొత్త పుస్తకాలు

'కొత్త పుస్తకాలు' శీర్షిక కింద సమీక్షకొరకు పుస్తకాలు పంపేవారు ఒక్కొక్క పుస్తకానికి రెండు ప్రతులు చొప్పున ఈ దిగువ చిరునామాకు పంపాలి:

ఎడిటర్
ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
ఎక్స్‌ప్రెస్ ఎస్టేట్
మద్రాసు-2

ఈ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు సాగించడం జరగదు.

—ఎడిటర్.





...ంతాచేసి యేడాదే. ఇంతలోనే ఆరు పళ్లు వచ్చేశాయి. ఎంతో సరదాగా వున్నారు.
ఆరోగ్య సూచకమైన ఆకలి. గాఢ నిద్రపోతాడు.
కాని కడుపునొప్పి!
అది తగ్గటం ఎంతోసేపు కాదులెండి.
బేబీటోన్ గ్రైప్ మిక్శ్చర్‌కు ధన్యవాదాలు
స్టాకిస్టు: వారి ఉత్పత్తి
అమర్ శోభ పోస్టు బాక్సు 318, మద్రాసు-3
పోస్టు బాక్సు 16460 బొంబాయి-16